

నిరాశ్రయులకు అండగా ఉంటాం

➢ ఉచిత న్యాయ సేవలు అందిస్తాం ➢ డిఎల్ఎస్ఎ సివిల్ జడ్జి పద్మజ



నిరాశ్రయుల వసతి భవనాన్ని పరిశీలిస్తున్న జడ్జి ఎంవిఎన్ పద్మజ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నిరాశ్రయులకు అండగా ఉంటూ ఉచిత న్యాయ సేవలు అందిస్తామని డిఎల్ఎస్ఎ సివిల్ జడ్జి ఎంవిఎన్ పద్మజ తెలిపారు. చిత్తూరు నగరంలోని మెప్మా, నగరపాలక సంస్థ సహకారంతో సపోర్ట్ సంస్థ ఆధ్వర్యంలో అధ్యక్షులు జోసఫ్ రాజు నిర్వహిస్తున్న రెండవ పట్టణ నిరాశ్రయుల వసతి గృహం కట్టమంచి సాయిబాబా గుడి పక్కన ఉన్న వసతి గృహాన్ని జడ్జి తనిఖీ చేశారు. అక్కడ నిరాశ్రయులకు అందుతున్న వసతుల, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. నిరాశ్రయులకు సేవలు అందిస్తున్న జోసఫ్ రాజును, సిబ్బందిని న్యాయమూర్తి ప్రశంసించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ ఆశ్రయం లేని వారిని ఆదుకుందామని మానవత్వాన్ని నిరూపిద్దాం అని అన్నారు. అలాగే ఇక్కడ ఉన్న నిరాశ్రయులకు వితంతువులకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది ప్రమీల, ఇంద్రాణి, శేఖర్, రఘుపతి పాల్గొన్నారు.



పూతలపట్టు మండల కేంద్రంలో ఇసుక డంప్

ఉచితం మాటున.. దందా!

> కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెల్ల బంగారమైన ఇసుకను ఉచితంగా పంపిణీ చేస్తామని నేతలు హామీ ఇచ్చారు. కానీ నేడు ఆ నేతల మాటలు నీటి మూటలుగా మారాయి. ఉచితం మాటున అక్రమార్కులు యథేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్నారు. అందిన కాడికి, అబ్బిన కాడికి దోచుకొని జేబులు నింపుకుంటున్నారు. పెద్ద ఎత్తున ఇసుక డంపింగ్ చేసుకొని అవసరాల కొద్ది ధరలు కేటాయించి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.
>
> - ప్రజాశక్తి-పూతలపట్టు

ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తామని ప్రజలకు హామీ ఇచ్చింది. దీంతో ప్రజలు సైతం తెల్ల బంగారం ఉచితంగా అందుతుందని సంబరపడ్డారు. తీరా చూస్తే తమకు ఎన్నటికీ ఇసుక కష్టాలు తీరవని అర్థమయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడమే అరుదుగా ఇసుక అక్రమార్కులు పంజా విసురుతున్నారు. అడ్డు అదుపు లేకుండా అందిన కాడికి దోచుకుంటున్నారు. భారీ ఎత్తున ఇసుక నిల్వలు పెట్టి అవసరాన్ని బట్టి ధరలు కేటాయించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు సైతం అధికార పార్టీకి చెందిన వారు కావడంతో చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇసుక అక్రమార్కుల ఆగడాలపై మండల ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

రాత్రి పగలు తేడా లేకుండా..

➢ **ఇష్టానుసారంగా ఇసుక దోపిడి** ➢ **చోద్యం చూస్తున్న అధికారులు**

వచ్చిన అవకాశాలను అక్రమార్కులు రెండు చేతులు అందిపుచ్చుకుంటున్నారు. వాగులు వంకలు అని తేడా లేకుండా ఇసుకను తరలించి జేబులు నింపుకుంటున్నారు. వంకల్లో అయితే బోరు బావులను తలపించే విధంగా ఇసుకను తోడేస్తున్నారు. రాత్రి పగలను తేడా లేకుండా ఇష్టానుసారంగా ఇసుక దోపిడి జరుగుతోంది. ప్రస్తుతం ఇచ్చిన నియమ నిబంధనలు కూడా పట్టించుకోవడం లేదు. వ్యవసాయ భూముల పక్కన ఇసుకను తీస్తుండడంతో వరదల సమయంలో వ్యవసాయ భూమి కోతకు గురైయ్యే ప్రమాదం ఉందని సంబంధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రభుత్వ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు. పూతలపట్టు మండలంలో రీచ్లు లేని కారణంగా ఇసుక అవసరమైన లబ్ధిదారులు వాగులు వంకల నుంచి ఉచితంగా ఇసుకను తీసుకోవచ్చు. కానీ వ్యాపారాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవు.

- గుర్రప్ప, తహశీల్దార్, పూతలపట్టు మండలం



26న మహా ప్రదర్శన

➢ సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యాదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సిపిఎం జిల్లా మహాసభలు 26 -27 చిత్తూరులో జరుగుతున్న నేపథ్యంలో 26న మహా ప్రదర్శన కార్యక్రమంలో జిల్లాలోని ప్రజలు, రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని గురువారం విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు కార్మికులు ఉద్యోగులు స్కీం వర్కర్లు సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలు చేసిన సందర్భంగా సిపిఎం ప్రత్యక్షంగా పాల్గొని మద్దతు తెలిపిందన్నారు. ఇలాంటి పార్టీ మహాసభలు జయప్రదం కోసం ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి రమాదేవి, రాష్ట్ర కమిటీ నాయకులు దడాల సుబ్బారావు హాజరవుతారని తెలిపారు. 26న మధ్యాహ్నం రెండు గంటలకు చిత్తూరు రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమై శేషాపిరాన వీది, గురునాథ థియేటర్ మీదుగా, చర్చి వీధి గాంధీ విగ్రహం మీదుగా ఎంఎస్ఆర్ సర్కిల్ వరకు కొనసాగుతుందని తెలిపారు. మహాసభల్లో మూడు సంవత్సరాలు చేసిన పోరాటాలను సమీక్ష చేసి భవిష్యత్ కార్యాచరణకు మహాసభల్లో నిర్ణయాలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు కే సురేంద్ర, గిరిధర్ గుప్తా, జ్యోతిరావు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

➢ డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి



వైద్యులకు సూచనలిస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: సమయపాలన పాటించాలని డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజల పట్ల ఆమర్యాదగా ప్రవర్తించకూడదన్నారు. స్నేహభావంతో చికిత్సలు చేయాలని ప్రతిరోగికి తగిన మందుల అందించి వ్యాధి నయమయేటట్టుగా చూడాల్సిన బాధ్యత వైద్యులపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు శిరీష, విజయ్ కుమారి, స్వరూప నాయక్, అఖిల్, భావన, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు డీఈవోగా వరలక్ష్మి



డీఈవో వరలక్ష్మి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యా శాఖలో గురువారం జిల్లా విద్యాశాఖాధికారుల బదిలీలు జరిగాయి. చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారిగా బి వరలక్ష్మి నియమితులెయ్యారు. అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారిగా పని చేస్తున్న వరలక్ష్మి చిత్తూరు జిల్లా డీఈవోగా బదిలీపై రానున్నారు. చిత్తూరులో ప్రస్తుతం డీఈవోగా పని చేస్తున్న దేవరాజులు అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు.

నేడు కుప్పంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యాక్రమాన్ని కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆదేశించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రొమ్ము క్యాన్సర్‌పై అపోలో విద్యార్థుల అవగాహన ప్రదర్శన

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: అపోలో యూనివర్సిటీలోని బయోమెడికల్ సైన్స్ విభాగం విద్యార్థులు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విభాగాధిపతి ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ అక్టోబర్ నెలను రొమ్ము కాన్సర్ అవగాహన మాసంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ అభివర్ణించిందని తెలిపారు. అపోలో మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రంగనాథ్ మాట్లాడుతూ రొమ్ము కాన్సర్ గురించి అవగాహన, రోగులకు కాన్సర్ నివారణకు ప్రభుత్వ పథకాలు, కాన్సర్‌ని తగ్గించుకొనే విధానాలను రోగులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. అపోలో యూనివర్సిటీ విద్యార్థులంతా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు పాదయాత్ర చేస్తూ మధ్యమధ్యలో ప్రజలకు కాన్సర్ లక్షణాలను పొగ త్రాగటం, మద్యపానం సేవించటం వల్ల కలిగే నష్టాలను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సి కళ్యాణి, డాక్టర్ శ్రీరూప్ రెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది విద్యార్థుల చేత వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న మెడికల్ విద్యార్థులు

నిఘానేత్రంలో చిత్తూరు జిల్లా!

➢ సరిహద్దులపై మరింత ఫోకస్
➢ నేరాలు అరికట్టడమే ప్రధాన లక్ష్యం అన్న ఎస్పీ
➢ శాంతిపురంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం



కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

ప్రజాశక్తి-శాంతిపురం: చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పోలీసులు నిఘా పెంచేందుకు కార్యరూపం దాల్చారు. మరింత పట్టిష్టమైన చర్యలకు ఉపక్రమించారు. సరిహద్దులపై మరింత ఫోకస్ పెంచేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నారు. చిత్తూరు నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఇటీవల, నిఘా దృష్ట్యా సీసీ కెమెరాల ఏర్పాటు, ఫాల్కన్ వాహనంతో పర్యవేక్షణ చర్యలు చేపట్టగా గురువారం జిల్లా సరిహద్దు ప్రాంతం శాంతిపురంలో ఎస్పి మణికంఠ చందోలు ఆధ్వర్యంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిపురం నేర రహిత మండలంగా మార్చడమే లక్ష్యంగా పోలీసు వ్యవస్థను సాంకేతిక నైపుణ్యతను పెంపొందిస్తూ నేరాలను అరికట్టడానికి ఈ కమాండ్ కంట్రోల్‌ను ఏరాట్లు చేశామని తెలిపారు. ఈ పర్యవేక్షణ వ్యవస్థ 6కిలోమీటర్ల మేర విస్తరించి మొత్తం 16 కెమెరాలు అమర్చినట్లు వివరించారు. శాంతిపురం పరిధిలో తుంసి, గట్టురు, బుడుమాకులపల్లి వంటి ముఖ్య ప్రాంతాలను పర్యవేక్షిస్తుందన్నారు. ఈ నూతన సాంకేతిక వ్యవస్థ మండలంలో జరిగే ప్రతి కదలికను నిరంతరం పర్యవేక్షించడానికి రూపొందించబడినట్లు ఆయన స్పష్టం చేశారు. 24గంటల పాటు, వారంలో ఏడు రోజుల పాటు ఈ వ్యవస్థ ఒక కానిస్టేబుల్ ద్వారా పర్యవేక్షించబడుతుందని చెప్పారు. ఆటోమేటిక్‌గా వాహనాల నంబర్ ప్లేట్లు గుర్తించ గలదని. దీనివల్ల నేరగాళ్ళ వాహనాలను సులభంగా ట్రాక్ చేయవచ్చని తెలిపారు. ఈ సాంకేతికతతో అనేక నేరాల విచారణలో సహాయ పడుతుందని, ముఖ్యంగా అపహరణలు, వాహన దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు వంటి వాటిలో కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అనంతరం శాంతిపురం ప్రాంతంలో ఒక ఔట్ పోస్ట్‌ను ప్రారంభించారు. ఈ ఔట్ పోస్ట్‌లో అక్కడి ప్రజలకు అత్యవసర సమయంలో పోలీస్ సేవలు చేరే వేగం మరింతగా పెరుగుతుందని అన్నారు. ఔట్ పోస్ట్ ఏర్పాటు, సీసీ కెమెరాలు అమర్చడం వంటి చర్యల వల్ల ప్రజల భద్రత మరింతగా మెరుగుపడుతుందని, ప్రజలకు పోలీసులపై నమ్మకం పెరుగుతుందని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో కుప్పం డిఎస్‌పి పార్థసారధి, కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, రాళ్ళబుదుగూరు ఎస్ఐ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలకు సిద్ధం కండి

➢ రాష్ట్ర కార్యదర్శి రమణ ➢ యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించిన ఉపాధ్యాయ బృందం



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న యూటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-యాదమరి: యుటిఎఫ్ స్వర్ణోత్సవాలకు సిద్ధం కావాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమణ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో యుటిఎఫ్ స్వర్ణ ఉత్సవాల సందర్భంగా ఉపాధ్యాయ బృందంతో కలసి పతాకావిష్కరణను చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రమణ మాట్లాడుతూ 1974లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం, విద్యా విధానంలో సమూల మార్పులకు, విద్యాహక్కు పరిరక్షణ చట్టాన్ని విద్యార్థులకు అనువుగా తీర్చిదిద్దడంలో యుటిఎఫ్ గత 50సంవత్సరాలుగా ముందుండి పోరాటాలు చేస్తున్నది. 2025 జనవరిలో యూటీఎఫ్ స్వర్ణోత్వాలు జరుపుకుంటున్నది. ఈ స్ఫూర్తితోనే ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి ముందు ముందు మరిన్ని పోరాటాలు చేసేందుకు సంసిద్ధం కావాలని పేర్కొన్నారు. పోరాటాల ఒరవడిని ఇలాగే కొనసాగించి విద్యా విధానంలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా వారి భవిష్యత్తుకు బాటలు వేసేందుకు యుటిఎఫ్ యూనియన్ ఎల్లప్పుడు ముందుంటు ందని ఈ సందర్భంగా తెలిపారు. స్వర్ణోత్సవ సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాలలో యాదమరి యుటిఎఫ్ నూతన కార్య వర్గాన్ని జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు జిల్లా ప్రధాన కార్యదర్శి మనీ గండన్, ఆధ్వర్య ంలో యాదమరి యుటిఎఫ్ ఉపాధ్యాయ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్వర్ణోత్స వాల జండా ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ దీనావతి, ఎస్టి బాషా, జిల్లా అసోసియే ట్ అధ్యక్షురాలు రెహనా బేగం, జిల్లా కార్యద ర్శులు పంటపల్లి సురేష్, ఏకాంబరం, పార్థసా రథి, రెడ్డప్ప నాయుడు, సరిత, జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, గౌరవ సలహాదారులు శివాజీ గణేష్, మండల అధ్యక్షులు పార్థసారథి, ప్రధాన కార్యదర్శి సర్దార్, యూనియన్ సీనియర్ నాయకులు ఎంఎన్ శేఖర్, వైఆర్ కృష్ణయ్య, రమేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

చిరుత మృతి కేసు..
అదుపులో ఐదుగురు అనుమానితులు

➢ విచారణ ముమ్మరం చేసిన అధికారులు
➢ అవశేషాలు స్వాధీనం
➢ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన డీఎఫ్‌వో భరణి



మీడియాతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో భరణి



స్వాధీనం చేసుకున్న చిరుత అవశేషాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 20వ తేదీ చిత్తూరు జిల్లా యాదమరి మండలం తాళ్లమడుగు అటవీప్రాంతంలో చిరుతపులి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణలో భాగంగా వెస్ట్ అటవీశాఖ అధికారులు చిరుతపులి అవశేషాలను తాళ్ళమడుగు సమీప గ్రామం వెదలచేను ప్రాంతంలో స్వాధీనం చేసుకొని ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు అటవీశాఖ జిల్లా అధికారి భరణి తెలిపారు. స్థానిక వెస్ట్ రేంజ్ అటవీశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అడవి పందుల వేటకోసం కోసం పంటపొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తగలడంతో చిరుత మృతి చెందిన్నట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలిపారు. వెదలచేను వద్ద అటవీ ప్రాంతంలో చిరుత పులి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిందన్నారు. దీనికి సంబంధించి పోలీసుల సహకారంతో దర్యాప్తు చేయగా వేటగాళ్లు వన్యప్రాణులను చంపడానికి పొలం వద్ద విద్యుత్ తీగలను అమర్చినట్లు గుర్తించామన్నారు. దర్యాప్తులో భాగంగా ఐదుగురు వేటగాళ్లను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టామని వారి వద్ద నుంచి చిరుత పులి అవశేషాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎవరైనా వన్యప్రాణులను చంపడానికి ప్రయత్నిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు వారి పొలాల వద్ద ఎవరైనా అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి ఉంటే పోలీసులకు లేదా అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

పుంగనూరులో చిరుత కలకలం

ప్రజాశక్తి-పుంగనూరు: పట్టణ సమీపంలో చిరుత పులి వెళుతున్నట్లు గురువారం ఉదయం కలకలం రేపింది. మదనపల్లి, పలమనేరు బైపాస్ రోడ్డులో చిరుతపులిని చూశామని స్థానికులు చెప్పారు. పట్టణ పరిధిలోని మేలుపట్ల గ్రామానికి చెందిన కొందరు రైతులు పులి చేనులోకి వెళ్లిందని స్థానికులు చర్చించు కోవడం జరిగింది. రోడ్డు దాటి చదళ్ల చెరువులో వెళ్లినట్టు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌కు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి స్థానికులు చెప్పిన ప్రాంతానికి వెళ్లారు. స్థానికుల చెప్పిన సమాచారమైతే చిరుత పులి అని చెప్పడం అయితే సెక్షన్ అధికారి చిరుత పులి కాదని హైనా, బావురు పిల్లి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ప్రజలు వాటిని చూసి చిరుత పులి అని చెబుతున్నారని తెలిపారు. అయినా ప్రజలు కొంత అప్రమత్తంగా ఉండాలన్నారు.



పుంగనూరు: చేనులో పరిశీలిస్తున్న అటవీ అధికారులు

ముమ్మరంగా పారిశుధ్య పనులు



జేసీబీతో చెత్తను శుభ్రం చేయిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని మాంభేడు గ్రామంలో గురువారం సర్పంచ్ సి.కవిత ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. డిడివో రమణయ్య దగ్గరుండి పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైన ప్పటికీ గ్రామం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయిందని, అదేవిధంగా చెత్తాచెదారాన్ని, పేడ దిబ్బలను తొలగిస్తూ పారిశుధ్య పనులు జోరుగా చేస్తున్నామని చెప్పారు. గ్రామాలలో ప్రజలకు అంటూ రోగాలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కసవనూరు గ్రామం వరకు ఈ పనులు సాగాయి.

నీటి సమస్యకు పరిష్కార చర్యలు



బోరు డ్రిల్లింగ్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నీటి సమస్య ఏర్పడింది. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద రావు ఎంపీ కోటా నిధులను మంజూరు చేయించారు. కాగా గురువారం ఆ పాఠశాలలో నూతన బోరు డ్రిల్లింగ్ పనులను టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఎంపీ నిధులు మంజూరు కావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్రిష్ణమనాయుడు, జీవర్నతం, శ్రీధర్ యాదవ్, నరసింహులు, శాంతకుమార్, సుధాకర్ శెట్టి, నీరజాక్షులురెడ్డి, సంపత్, శంకర్, శ్రీనివాసులు శెట్టి, రాఘవేంద్ర, హెచ్ఎం రాజేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు సహకరించండి



అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్ కానిక్ రాజు

ప్రజాశక్తి-విజయపురం: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు అందరూ సహకరించాలని లెప్రసీ డిప్యూటీ పేరా మెడకల్ ఆఫీసర్ కానిక్ రాజు పేర్కొన్నారు. గురువారం శ్రీహరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కుష్ఠు వ్యాధి నివారణ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. కుష్ఠు వ్యాధి మైక్రో బక్టేరియం లేప్రి అను బక్టేరియంవలన వస్తుంది అని ఈ క్రిములు తుమ్మడం, దగ్గడం వలన గాలి నుంచి వ్యాప్తి చెందుతాయాన్ని స్వర్శ లేని మచ్చులు ముఖము, చెవులు, ఎద, వీపు మీద నొప్పి లేని బూడిపేలు ఉంటే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సంప్రదించాలని పేర్కొన్నారు. హెచ్ఎం జ్ఞాన ప్రసాద్, ఉపాధ్యాయులు వెంకమరాజు, విజయకుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు మురళి, సిబ్బంది చందన, గీత, సుజాత, భారతి, లక్ష్మి, లత పాల్గొన్నారు.

ఘనంగా వైట్ కోట్ సెరెమోనీ

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పిఈఎస్ వైద్య కళాశాలలో గురువారం కళాశాల డీన్, ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ఆర్ కృష్ణారావు ఆధ్వర్యంలో వైట్ కోట్ సెరెమోనీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య విద్య విశిష్టతను మొదటి సంవత్సరం విద్యార్థులకు వివరించారు. అలాగే ఈ ఐదు సంవత్సరాలు విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించి, భవిష్యత్తులో ఉత్తమ వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షించారు. చివరగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాలలోని వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగిస్తాం: తహశీల్దార్

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని కొత్తచెరువు ఇరిగేషన్ కాలువ ఆక్రమణకు గురైంది. దీనిపై గతంలో జిల్లాస్థాయి అధికారులు అక్కడికి చేరుకుని పరిశీలించి, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి ఆదేశాల మేరకు గురువారం తహశీల్దార్ రమేష్ బాబు తమ సిబ్బందితో కొత్తచెరువు కాలవ పరంబోకు దగ్గరకి పోలీస్ సిబ్బందితో వెళ్లారు. అక్కడ ఉన్న స్థానికులు వారిని అడ్డుకున్నారు. వాదోపవాదాలు జరిగాయి. దీంతో తహశీల్దార్ మీడియాతో మాట్లాడుతూ.. ఆక్రమణలు ఉన్న మాటే వాస్తవమే న్యాయపరంగా వెళ్లి ఆక్రమణలను తొలగించి న్యాయం చేస్తామని తెలిపారు.

ఐదవ విడత ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-శాంతిపురం: శాంతిపురం ఐటిఐ కళాశాలలో ఐదవ విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగేష్ గురువారం ప్రకటన విడుదల చేశారు. వృత్తి విద్యా కోర్సులలో చేరాలనుకునే అభ్యర్థులు iti.nic.in వెబ్సైట్‌ను సందర్శించి ఈ నెల 26లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27వ తేదీ సాయంత్రం మూడు గంటలకు సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. 28వ తేదీన ఉదయం 9గంటలకు జరిగే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-సదుం: మండలంలోని చెరుకువారిపల్లి, బలిజపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ చంద్రశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్, ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అధికారులు రైతులకు అండగా ఉండాలి

- కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: మామిడి పంట పూత నుంచి కోత వరకు లాభ సాటి సాగు పద్ధతులపై సచివాలయ పరిధిలో ఉద్యాన, వ్యవసాయ అధికారులు రైతులకు అండగా ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం చిత్తూరులోని మ్యాంగో భవన్‌లో మామిడి పంట సస్య రక్షణ చర్యలపై సచివాలయ ఉద్యాన, వ్యవసాయ అధికారులకు ఉద్యాన శాఖ ద్వారా నిర్వహించిన అవగాహన సదస్సునకు ముఖ్యఅతిథిగా కలెక్టర్ విచ్చేసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మామిడి రైతుకు తక్కువ పెట్టుబడితో అధిక



దిగుబడి వచ్చేలా మెరుగైన పంట విధానాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఒక పంటకు మరొక పంటకు కొంత సమయం ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఒక్కొక్క సచివాలయ పరిధిలో 200 నుంచి 300 మామిడి రైతులు ఉంటారని, అందులో సాగు విధానంలో శ్రేష్టమైన, అధునాతన పద్ధతులను, పంట తెగుళ్ళను నివారించడంలో అవలంభిస్తున్న పద్ధతులను రైతుల నుంచి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకుని అవసరమైన రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పంట సమయంలో వినియోగించే ఎరువులు, క్రిమి సంహారక మందుల మోతాదుపై అవగాహన కల్పించి అనవసర సాగు ఖర్చును నియంత్రించి ద్వారా లాభం చేకూర్చగలమని తెలిపారు. మామిడి తోటల్లో చెట్లకు బాగా సూర్యరశ్మి తగిలేలా చూసుకుంటే చీడ, పీడల బెడద తగ్గుతుందన్నారు. ఈ అవగాహన సదస్సులో ఉద్యాన, వ్యవసాయ, ఏపీఎంఐపీ అధికారులైన మధుసూదన్ రెడ్డి, మురళీకృష్ణ, బాలసుబ్రమణ్యం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అంటు వ్యాధులు గుర్తిస్తే సమాచారం ఇవ్వండి

- డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభావతి దేవి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లాలోని వైద్యాధికారులకు ఎపిడమిక్స్ సీజనల్ వ్యాధులపై గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభావతి దేవి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యంగా ఎక్కడైనా అంటువ్యాధులు ప్రబలినప్పుడు వెంటనే జిల్లా అధికారులకు తెలపాలన్నారు. ప్రతివారం ఖచ్చితంగా నీటిని పరీక్ష చేసి వెక్టార్ హైజన్ యాప్‌లో రిపోర్ట్ చేయాలన్నారు. తద్వారా నీటిలో కలుషిత బ్యాక్టీరియా ఉన్నచో వెంటనే తెలుస్తుంది. తిరిగి కొత్తగా కేసులు వస్తుంటే వెంటనే 24గంటలు మెడికల్ క్యాంపు, కేసులు తగ్గేంతవరకు కండక్ట్ చేయాలన్నారు. అలాగే హౌస్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

టు హౌస్ సర్వే చేపట్టి కొత్త కేసులు ఏమైనా ఉంటే తెలుస్తుందన్నారు. ప్రతి డయేరియా కేసును పూర్తిగా తగ్గినంత వరకు చికిత్స చేసి తర్వాత ఇంటికి పంపి ఫాలో అప్ చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ ఉండాలని సూచించారు.

బస్సు సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు డిపోలో 7బస్సు సర్వీసులను గురువారం ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ప్రారంభించారు. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడతాయని ఆయన ఈ



సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ స్వామి, ఆర్‌వి బాలాజీ, ఆర్‌బిసి కుట్టి, గిరిబాబు, నాగరాజు, ఖాజా, శ్రీధర్, చిన్ని, కిరణ్, బిఆర్సి కుమార్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ



ప్రజాశక్తి-కుప్పం రూరల్: కుప్పం మండలం కంగుంది గ్రామ పంచాయతీలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి రంగోత్సవ్ పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచినట్టు పాఠశాల హెచ్ఎం కె సుచరిత తెలిపారు. ఆమె మాట్లాడుతూ రంగోత్సవ్ రాష్ట్రస్థాయి పోటీలు ఆన్లైన్లో నిర్వహించినట్టు తెలిపారు. ఈ పోర్టీలలో తమ పాఠశాల విద్యార్థులు పల్లవి, అశ్విన్, యశ్వంత్ కుమార్, ప్రేమ్ కుమార్, సురేంద్రలు బంగారు పథకాలు, పవిత్ర, భరత్, దినేష్, ధనలక్ష్మిలు వెండి పథకాలను, దినేష్, పావని, కీర్తన కుమారిలు కాంశ్య పథకాలను సాధించినట్లు తెలిపారు. తమ పాఠశాల అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడంపై ఆనందం వ్యక్తం చేస్తూ, అంతర్జాతీయ పోటీలలో సైతం ఉత్తమ ప్రతిభను కనబరిచి, పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో జిల్లాకు ప్రథమ స్థానం

- జిల్లా వాలీబాల్ కోచ్ సిరాజ్ అహ్మద్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అండర్ 17 వాలీబాల్ పోటీల్లో జిల్లా ప్రథమ స్థానం సాధించినట్టు జిల్లా వాలీబాల్ కోచ్ సిరాజ్ అహ్మద్ అన్నారు. గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లాలో గెలుపొందిన బాలురకు అభినందన సభ జరిగినది. ఆయన మాట్లాడుతూ ఈనెల 21-23 తేదీల్లో సత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగిన అండర్ 17 వాలీబాల్ పోటీల్లో జిల్లా మొదటి స్థానం కైవసం చేసుకున్నదని, చిత్తూరు జిల్లా, గుంటూరు జిల్లా ఫైనల్లో తలపడగా రెండు ఒకటి ఆధిక్యంతో చిత్తూరు జిల్లా జట్టు గెలుపొందినట్లు చెప్పారు. అదేవిధంగా బాలికల జట్టు కూడా జిల్లా ప్రథమ



స్థానం సాధించినట్లు వివరించారు. గెలుపొందిన క్రీడాకారులను జడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ కార్యదర్శి సుదర్శనం నాయుడు, హెచ్ఎం రాజేంద్ర, పీడీలు గిరిజ, విజయ్ కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి

- డీపీవో పార్వతి

ప్రజాశక్తి-పూతలపట్టు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు వ్యాధులు బారిన పడే ప్రమాదం ఉంది. ప్రతి గ్రామంలోనూ పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని పార్వతి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యదర్శుల విధి విధానాలను ఆమె వివరించారు. ముఖ్యంగా మురుగు కాలువలు, చెత్తకుప్పలు, శుభ్రం చేయాలని తెలిపారు. ప్రస్తుతం పంచాయతీల్లో నిధులు ఉన్నందున ఇలాంటి ఆలస్యం లేకుండా వెంటనే పనులు ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వేగంగా చేతి బోర్లుకు మరమ్మతులు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-పూతలపట్టు: మండలంలో చేతి బోర్లుకు మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈనెల 21న ప్రజాశక్తిలో 'నిర్లక్ష్యం' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు అన్ని గ్రామాల్లో పర్యటించి మరమ్మతులకు గురైన చేతి



బోర్లను గుర్తించారు. ఈ క్రమంలో చేతి బోర్ల మరమ్మతులు సర్వేగంగా చేస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న ప్రతిబోరును పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీవో నాగరాజు తెలిపారు. సంవత్సరాలు తరబడి నిరుపయోగంగా ఉన్న చేతి బోర్లు ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనం మేరకు స్పందించి అధికారులు మరమ్మతులు చేపడుతుండడంతో.. మండల ప్రజలు ప్రజాశక్తి దినపత్రికకు అభినందనలు తెలిపారు.

మండలాభివృద్ధికి కృషి చేద్దాం

- ఉపాధి, గృహ నిర్మాణాల బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిరంతరం పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని అదేవిధంగా అన్ని రంగాల్లో మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీడీవో బాలాజీ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. చలమంగళం, పెద్దపంజాణి, అమ్మరాజుపల్లి పంచాయతీ కేంద్రాలలో ప్రత్యేక ఆధార్ క్యాంప్స్‌లో ఇప్పటివరకు 128మందికి ఆధార్ అప్డేట్స్ జారీ చేసినట్లు



తెలిపారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని కార్యదర్శులకు సూచించారు. పంచాయతీ విస్తరణ అధికారి శారదా దేవి, ఉపాధి హామీ ఎపిఓ చిన్న రెడ్డమ్మ, పరిపాలన అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

కాంతమ్మకు ఘన నివాళి



ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం పట్టణ ప్రజాశక్తి విలేకరి కన్నన్ తల్లి కె కాంతమ్మ గురువారం స్వర్గస్తులయ్యారు. విషయం అందుకున్న స్థానిక అధికార, ప్రతిపక్ష నాయకులతో పాటు ప్రజాశక్తి డివిజినల్ ఇన్‌ఛార్జ్ రామాంజనేయులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో కాంతమ్మ ఇంటి వద్దకు చేరుకొని మృతుదేహానికి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు.

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా లోకేష్ బాధ్యతలు స్వీకరణ



లోకేష్

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: జీడీ నెల్లూరు ఎంపీడీవో కార్యాలయ ఏవోగా లోకేష్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో లోకేష్ జెడ్పీ కార్యాలయంలో విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం బదిలీపై మండల పరిషత్ కార్యాలయంలో భాద్యతలు చేపటారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న లోకేష్‌ను మండల పరిషత్ సిబ్బంది అభినందించారు.

ఆర్టీసీ బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం

- ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీని తప్పించబోయి ఆర్టీసీ బస్సు డ్రైవర్ చాకచక్యంతో పక్కకు తప్పించి త్రుటిలో భారీ ప్రమాదం నుంచి బయటపడ్డ సంఘటన గురువారం బొబ్బిగానిపల్లి వద్ద చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు వివరాల మేరకు.. చిత్తూరు - పుత్తూరు రహదారిపై నెల్లేపల్లి సమీపంలోని బొబ్బిగానిపల్లి వద్ద చిత్తూరు నుంచి పుత్తూరు వైపునకు వెళుతున్న ఆర్టీసీ బస్సుకు, పుత్తూరు వైపు నుంచి ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీ డ్రైవర్ నడిరోడ్లో గుంతను తప్పించపోయి అదుపుతప్పింది. ఆర్టీసీ బస్సు డ్రైవర్ చాకచక్యంగా బస్సును పక్కకు తిప్పడంతో భారీ ప్రమాదం తప్పింది. బస్సులోని ప్రయాణికులు ఎటువంటి గాయాలు కాకపోగా భయభ్రాంతులకు గురయ్యారు. అనంతరం జీడీ నెల్లూరు పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకున్న పోలీసు సిబ్బంది జెసిబి సహాయంతో ఆర్టీసీ బస్సును పక్క తీయించారు.

'భూ సమస్యలపై రైతులకు ఆందోళనొద్దు'

ప్రజాశక్తి-పూతలపట్టు: భూ సమస్యలపై రైతులు కంగారు పడాల్సిన అవసరం లేదని డిప్యూటీ తహ శీల్దార్ రైతులకు సూచించారు. మండలంలోని వేపనపల్లి గ్రామంలో గురువారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. గ్రామాల్లో రీ సర్వేలో తలెత్తిన సమస్యలపై ఆయన మాట్లాడారు. భూమి విస్తీర్ణం, మార్పులు, చేర్పులు వంటి కార్యక్రమాలను త్వరలో చేపడతామని రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల సర్వేయర్ చంద్రశేఖర్ సిబ్బంది ఉన్నారు.

కాంట్రాక్ట్ పనులకు టీడీపీ కసరత్తు

ప్రజాశక్తి-పుంగనూరు: మండలంలో చేపట్టే అభివృద్ధి కాంట్రాక్ట్ పనులపై టీడీపీ నాయకులు కసరత్తు చేపట్టారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో టీడీపీ మండల అధ్యక్షులు మాధవరెడ్డి అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు, వాటర్ షెడ్ పనులు మంజూరు కావడం జరిగింది. దీనిపై ఏ పనులు ఎవరెవరికి కేటాయించాలని సమావేశంలో చర్చించారు. మండలంలో అన్ని పంచాయతీలకు సమిష్టి న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకోవాలని పలువురు కార్యకర్తలు సూచించారు. పనులు పంచి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చూడాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుతానికి మండలంలో పది పంచాయతీలకు గాను సీసీ రోడ్లు రూ.86లక్షలు,



కాంట్రాక్ట్ పనులపై చర్చిస్తున్న టీడీపీ నాయకులు

డ్రెయిన్స్ రూ.36లక్షల మంజూరు అయింది. మొదట విడత పనులు పూర్తి చేసిన వెంటనే మిగిలిన పంచాయతీలకు కూడా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడం జరుగుతుంది అన్నారు. కార్యక్రమంలో మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ రమణ, శ్రీనాథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గంగాధర్, గంగరాజు, సుబ్రమణ్యం, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మరుదు పాండియన్ సోదరులకు ఘన నివాళి



మరుదు సోదరులకు నివాళులర్పిస్తున్న బుల్లెట్ సురేష్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: మరుదు పాండియన్ సోదరుల త్యాగనిరతిని ప్రతి ఒక్కరూ స్పందించుకోవాలని మొదలియార్ రాష్ట్ర కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బుల్లెట్ సురేష్ తెలిపారు. గురువారం చిత్తూరు నగరంలోని గంగినేని చెరువు వద్ద మరుదు పాండియన్ సోదరుల విగ్రహాల వద్ద వారి 223వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర సంగ్రామంలో తమిళనాట జన్మించిన మరుదు పాండియన్ సోదరులు స్వతంత్ర సంగ్రామంలో కీలక పాత్ర పోషించారన్నారు. తెల్లదొరలు వారిని వారి వారసులైన 538మందిని ఏకకాలంలో ఉరి తీశారన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారిని స్మరించుకోవడం మన కర్తవ్యం అన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించండి

ఆర్డీవో శ్రీనివాసులు

ప్రజాశక్తి-యాదమరి: ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని చిత్తూరు రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. గురువారం అశ్వింధా మండల పరిధిలోని కెనటం పల్లి గ్రామానికి చెందిన కే మోహన్ నాయుడు, కుక్కలపల్లి గ్రామానికి చెందిన జ్యోతి, దారి సమస్య పరిష్కరించాలని స్పందన ఫిర్యాదు చేశారు. ఈ విషయంగా ఆర్డీవో ఫిర్యాదుదారుల గ్రామానికి వెళ్లి వారితో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకుని దారి సమస్యను పరిష్కరించారు. మండల స్థాయి పరిధిలో ఫిర్యాదు అందిన వెంటనే రెవెన్యూ



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో యాదమరి తహశీల్దార్ పార్థసారధి, ఆర్ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు బృందావన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలను నిర్వహించినట్లు జిల్లా ఎస్‌జిఎఫ్ కార్యదర్శి వసంత వాణి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శైలజ కుమారి, డైరెక్టర్ ప్రియతేజ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. శైలజకుమారి ప్రసంగిస్తూ క్రీడాకారులు చదువుతోపాటు క్రీడలను సాధన చేయాలని తెలిపారు. మంచి నైపుణ్యం గల క్రీడాకారులు చదువులో కూడా రానిస్తారని చెప్పారు. ఎంపిక పోటీలలో జిల్లా నలుమూలల నుంచి 84మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన అండర్-17 క్రీడాకారులు నవంబరు 3 నుంచి 5వ తేదీ వరకు చిత్తూరు డిఎస్‌ఏ స్టేడియంలో, నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని వివరించారు. అండర్-14వాళ్లు నవంబరు 9, 10 తేదీలలో డిఎస్‌ఏ స్టేడియం నంద్యాలలో రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు.




విజేతలతో కరెస్పాండెంట్ శైలజకుమారి

ఎంపికైన విద్యార్థులు అనిల్, పురుషోత్తం, చెంచురాముడు ఎపిఆర్‌ఏసి శ్రీకాళహస్తి, దీక్షిత్‌రెడ్డి గ్యారంపల్లి, బాను పూతలపట్టు, బాలికల విభాగం నుంచి శాలిని తిరుపతి, మహిత గేయని, శ్రీకాళహస్తి, సుభాషిణి, మునగాలపాలెం, నిషిత పూతలపట్టు అండర్ 14 దినేష్, చందు శ్రీకాళహస్తి, భవ్యష్ చంద్రగిరి, నవనీత్ సైనిక్ స్కూల్, హర్షిత్ బృందావన్ స్కూల్, బాలికలు అండర్ 14 నుంచి అక్షిత, జ్యోతి, రేఖ తిరుపతి, నీతుశ్రీ బృందావన్, దీప్తి మేఘన ముత్సువోలు శ్రీకాళహస్తి ఎంపికైయ్యారని తెలిపారు.

శ్రీగంధం స్వాధీనం

- ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ముగ్గురు శ్రీగంధం దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 4కేజీల దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎఫ్‌వో భరణి తెలిపారు. గురువారం అటవీశాఖ వెస్ట్ రేంజ్ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన రాబడిన ఖచ్చితమైన సమాచారం మేరకు చిత్తూరు వెస్ట్ రేంజ్ పరిధిలో జరిపిన మెరుపుదాడుల్లో చిత్తూరుకు చెందిన విజయ్ కుమార్, చిత్తూరు రూరల్ మండలం శేషాపురానికి చెందిన రాజేంద్ర, గణేష్ అనే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి నాలుగు కేజీల శ్రీగంధం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా శ్రీగంధం అక్రమ రవాణా చేసిన, విక్రయించిన వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



స్వాధీనం చేసుకున్న శ్రీగంధం చెక్కలు, కత్తులు

మతిస్థిమితం లేని వ్యక్తి బావిలో పడి మృతి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని మాంబేడుకు చెందిన సంజీవయ్య(80) మతిస్థిమితం కోల్పోయి బావిలో పడిపోయాడు. ప్రమాదవశాత్తు సుమారుగా మూడు రోజులు క్రితం బావిలో పడినట్లు స్థానికులు గుర్తించారు. బావిలో నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు వెళ్లి చూశారు. గురువారం మృతదేహాన్ని గ్రామస్తులు, బంధువులు గుర్తించారు.